# 3

# క్రీస్తునందు జీవించువారు

"మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" (ఎఫెసీ. 1:3).

వివాహమందు స్త్రీ పురుషులు ఒకరినొకరు కలిగియుండే బంధానికి గురుతుగా వెడ్డింగ్ రింగులను లోకంలోని అనేక నాగరికతలవారు ధరించుతారు. ఈ బాంధవ్యానికి దృశ్యమైన ఈ గురుతు చిన్నదే (ఎక్కువ తరచుగా బహు ఖరీదైనదిగా ఉంటుంది), కాని దాని భావం మాత్రం జీవిత పర్యంతముండే వాగ్దానాన్ని అది సూచిస్తుంది. వివాహానికి సంబంధించిన ఈ చిన్న గురుతువంటి చిన్న విషయాలే తరచుగా చాలా ముఖ్యమైన భావాలను తెలియజేస్తాయని జ్ఞాపకం చేస్తాయి.

"క్రీస్తునందు" అనే క్రొత్త నిబంధన పదం, రెండు మాటల ప్రయోగం, కొన్ని సార్లయితే దాదాపుగా స్పష్టంగా గోచరించనిది, ఎల్లవేళలా చాల అర్థవంతంగా ఉంటుంది. బలీయమైన ఆత్మ సంబంధమైన భావన లేకుండ అది ఎన్నడూ కన్పించదు. అది "క్రీస్తునందు" (రోమా 12:5), "క్రీస్తుయేసునందు" (రోమా 3:24), "మన ప్రభువైన క్రీస్తుయేసునందు" (రోమా 8:39), "ఆయనయందు" (2 కొరింథీ. 5:21), "ప్రభువైన యేసునందు" (రోమా 14:14), "ప్రభువునందు" (1 కొరింథీ. 4:17), "ఆయన కుమారునియందు" (1 యోహాను 5:11), "యేసునందు" (ఎఫెసీ. 4:21), "ఆయన లోనికి" (ఎఫెసీ. 4:15), "ఎవనియందు" (ఎఫెసీ. 2:21), "ప్రభువైన యేసుక్రీస్తు నందు" (2 థెస్స. 3:21), "యేసునందు" (1 థెస్స. 4:14), లేక "ఆయన కుమారుడైన యేసుక్రీస్తునందు" (1 యోహాను 5:20) అంటూ పద ప్రయోగం జరుగవచ్చు; కాని దైవశాస్త్రానికి సంబంధించిన దాని అర్థం మాత్రం అలక్ష్యం చేయకూడదు. క్రీస్తు యొక్క ఆత్మసంబంధమైన శరీరమందు అది క్రీస్తుతోనున్న ఐక్యమత్యాన్ని సూచిస్తుంది. అందువలన, ఈ పద ప్రయోగమందు గుప్తమైన దానిని మనం అలక్ష్యం చేసినట్లయితే, దేవుని సంకల్పంలో సంఘము యొక్క అర్థాన్ని దాని స్థానాన్ని మనం గ్రహించలేం.

క్రొత్త నిబంధన రచనలో "క్రీస్తునందు" మరియు "సంఘమునందు" అనే రెండు పద ప్రయోగాలు ప్రధానంగా ఒకే అర్థాన్ని యిస్తాయి. ప్రభువైన యేసు హెచ్చింపబడిన స్థితిని గూర్చి పౌలు వ్రాస్తూ, సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచబడి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించబడిన సంగతిని వివరించినప్పుడు, ఆ సంఘము "ఆయన శరీరమని, సమస్తము సంపూర్ణంగా నింపువాని సంపూర్ణతయై యున్నట్టు తెలియజేసాడు" (ఎఫెసీ. 1:22, 23). పౌలు ప్రకారం, సంఘము క్రీస్తు

శరీరం; ఈ విధంగా "క్రీస్తునందు" ఉండడమంటే "క్రీస్తు సంఘమందు" ఉండడమే.

"క్రీస్తునందు" అనిగాని లేక క్రొత్త నిబంధన అంతటిలో దానికి సమానమైన ప్రయోగాలను (ప్రత్యేకించి పౌలు రచనలలో) మనం జాడకట్టినప్పుడు, సంఘాన్ని గూర్చి ఊపిరి తిరగని దైవశాస్త్రంయొక్క భావాన్ని, మరియు దానితో మన సంబంధాన్ని మనం చూస్తాం.[1] దానిని గూర్చి జాగ్రత్తగా చేసే ఆలోచన ఆయన దేహంలో మనకు ప్రాప్తించే ఆత్మసంబంధమైన ఆశీర్వాదముల యొక్క గంభీరత్వంతో మనలను ఒప్పిస్తుంది. ఈ పద ప్రయోగాన్ని, గ్రహింపకుండ, క్రీస్తు సంఘ సభ్యుడంటే లేఖనానుసారమైన దృష్టి ఏమైయుందో మనం ఎరుగలేం.

## ధన్యకరమైన చోటు

మొదటిగా, "క్రీస్తునందు" అనే ప్రయోగం ప్రభువు సంఘ సభ్యులకుచెందిన ప్రత్యేకానుకూలతలను తెలుపుతోంది. "క్రీస్తునందు" మనం దేవునియొక్క ఏర్పరచబడిన జనమైయున్నాం.

ఎఫెసీ. 1:3–14యొక్క విస్తరింపజేయబడిన దీవెనలలో, "క్రీస్తునందున్న" వారిని తన సొత్తుగా చేసికొన్నందుకు పౌలు దేవుని స్తుతించాడు:

> ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను (ఎఫెసీ. 1:4–6).

ఏర్పరచబడినవాడు రక్షింపబడడం, లేనివాడు నశించిపోవడం అనే వ్యక్తులయొక్క భవిష్యత్ నిర్ణయాన్ని గూర్చి పౌలు వ్రాయలేదు. క్రీస్తులోనికి వచ్చి, ఆయనయందు నమ్మకముగా నిలిచియున్నవారిని ఏర్పరచుకొన్న దేవుని భవిష్యత్ నిర్ణయాన్ని అతడు సూచిస్తున్నాడు. క్రీస్తు శరీరము ధన్యకరమైన చోటైయుండాలని, క్రీస్తు శరీరములోనికి వచ్చినవారిని తన కుమారులనుగా స్వీకరించాలని జగత్తు పునాది వేయబడకమునుపే దేవుడు ఏర్పరచుకున్నాడు.

ఇట్టి దేవుని ఏర్పాటు మానవ స్వాతంత్ర్యంతో పోరాడదు. పైగా, ఆ ఏర్పరచబడిన వారిలో తాను కూడా ఉండగోరే స్వాతంత్ర్యాన్ని అది ప్రసాదిస్తుంది. క్రీస్తు శరీరాన్ని రక్షించాలని దేవుడు ముందుగానే ఏర్పరచుకొన్నాడు; అయితే మనిషి ఆ శరీరంలో ఉండ కోరుకోవాలి, మరియు అందులోనే నిలిచియుండ కోరుకోవాలి.

నోవహు రక్షింపబడడానికి దేవుడు స్థలాన్ని ఏర్పాటు చేశాడు (ఆది. 7:1), కాని నోవహును అతని యింటివారును అందులో ప్రవేశించి, దానిలోనే నిలిచియుండ వలసియుంది (ఆది. 7:7). నోవహుకును అతని యింటివారికిని ఓడ ఒక ధన్యకరమైన చోటైయుంది. భూ జనులందరిలో, నోవహును అతని భార్యయు, అతని కుమారులును,

కోడంట్రును ఏర్పరచబడిన దేవుని జనులైయున్నారు – వారు దేవుని కృపనుబట్టియు కాపుదలనుబట్టియు కాపాడబడి పోషింపబడ్డారు.

ఒక వ్యక్తి యిలా చెప్పాడు, మనం పరలోకం వెళ్లినప్పుడు, గవిని ఎదుట "నా యొద్దకు రండి" అని సైన్ బోర్డ్ ఉందట. మనం పరలోకంలో ప్రవేశించగా, మనం ఆ మాటలు చదివి, రక్షణ కొరకైన ప్రభువు యొక్క ఆహ్వానాన్ని గూర్చియు, ఆ ఆహ్వానాన్ని అంగీకరించి వచ్చేవారికి దేవుడనుగ్రహించిన స్వాతంత్ర్యాన్ని గూర్చియు ఆలోచన చేస్తాం. పరలోకంలో ప్రవేశించిన తరువాత, ఆ సైన్ బోర్డుకు వెనుకతట్టు వ్రాయబడినదాన్ని చూస్తాం. "దేవునిచే ఏర్పరచబడినవారు" అని ఉంటుంది. క్రీస్తు శరీరాన్ని రక్షించడానికి జగత్తు పునాది వేయబడకమునుపే కోరుకున్నట్టును, క్రీస్తు శరీరంలోనికి ప్రవేశించి అందులో నమ్మకంగా నిలిచియున్నవారికి ప్రసాదింపబడిన సాటిలేని సౌభాగ్యాన్ని గూర్చియు అప్పుడు మనం ఆలోచిస్తాం.

క్రీస్తు శరీరమైన సంఘంలోనికి ప్రవేశించిన ఎవడైనా, ధన్యతపొందే స్థలంలో, దేవుడు ఏర్పరచుకున్న స్థలంలో ప్రవేశించినవాడై ఉంటాడు. మనం దేవుని పిల్లలమా కాదా అనేది అదృష్టంవలన కలిగేది కాదు (లేక ఆకస్మిక సంభవంవలన కలిగేది కాదు). అది కోరుకున్నందువలన కలిగేదే. రక్షణ స్థలాన్ని దేవుడు కోరుకున్నాడు, అయితే మనం ఆ స్థలంలో ప్రవేశింప కోరుకొని అందులోనే ఉండిపోవాలి. క్రీస్తు శరీరంలోనికి మనం ప్రవేశింప కోరుకున్నప్పుడు, దేవుడు మనలను తన కుమారులనుగాను వాగ్దానాలకు వారసులుగాను ఏర్పరచుకొంటాడు.

## ఏర్పాట్లతో కూడిన చోటు

ధన్యకరమైన చోటుగా ఉండేదానితోపాటు, "క్రీస్తునందున్న" వ్యక్తికి దేవుని అత్యధికమైన ఆత్మసంబంధమగు ఏర్పాట్లు చేయబడ్డాయి. క్రీస్తు ప్రభువుయొక్క శరీరము "సమస్తమును నింపువానియొక్క సంపూర్ణతయైయున్నది" అని పౌలు వ్రాసాడు (ఎఫెసీ. 1:23). అతడింకను యిలా అన్నాడు, ''ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు … తండ్రి అభీష్టమాయెను" (కొలస్సీ. 1:19). అందువలన, "ఆయనయందు మనము సంపూర్ణులమై యున్నాము" అని అతడు చెప్పగలిగాడు (కొలస్సీ. 2:10).

దేవుడు మనకు ప్రసాదించే ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము "క్రీస్తునందు" ఉంది. ఎఫెసీ. 1లో పౌలు తన స్తుతిని ప్రారంభించి, దేవుడు క్రీస్తునందు మనకు చేసిన దానినంతటిని ఒక ప్రతిపాదనలో యిలా సంక్షిప్తం చేశాడు: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను" (ఎఫెసీ. 1:3). పౌలుయొక్క "ప్రతి" అనేది పూర్ణ వివరాలుగలది. ఏదియెలాగున్నా, క్రీస్తులోనికి వచ్చి, ఆయనయందు నిలిచియుండకుండ దేవునియొక్క అత్యధికమైన, ధారాళమైన ఆత్మ సంబంధములగు ఏర్పాట్లను పొంద వీలుపడదు.

"క్రీస్తునందు" మనకు లభ్యమయ్యే దీవెనలను గూర్చి ఆలోచించు. మొదట, "క్రీస్తునందు" రక్షణను గూర్చిన దీవెనలు మనకున్నాయి. "ఆయనయందు" మనకు పాపక్షమాపణ ఉంది: "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది" (ఎఫెసీ. 1:7). "క్రీస్తునందు" మనము నూతన సృష్టి: "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ. 5:17). "యేసుక్రీస్తునందు" మనకు నిత్యజీవముంది: "అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతోకూడ క్రీస్తుయేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను" (2 తిమోతి 2:10).

దేవుడు మనకు ప్రసాదించు
ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము
"క్రీస్తునందు" కన్పిస్తోంది.

రెండవది, "క్రీస్తునందు" కుమారత్వానికి సంబంధించిన దీవెనలున్నాయి. "క్రీస్తుయేసు నందు" సంపూర్ణంగా తండ్రిని చేరే అవకాశముంది: "అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు"; "ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలిగి యున్నాము" (ఎఫెసీ. 2:13, 18). ఆయనయందు మనకు నిత్య స్వాస్థ్యముంది. "మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తికలుగజేయవలెనని, దేవుడు తన చిత్తప్రకారమైన సంకల్పమునుబట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయనయందు స్వాస్థ్యముగా ఏర్పరచెను" (ఎఫెసీ. 1:10, 11).

మూడవది, భద్రతను గూర్చిన దీవెనలు "క్రీస్తునందు" మనకున్నాయి. "ఆయన యందు" మనం పరిశుద్ధాత్మతో ముద్రింపబడియున్నాం: "మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి" (ఎఫెసీ. 1:13). క్రీస్తునందు శిక్షావిధి లేని వారమయ్యాం: "కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు" (రోమా 8:1).

ఆత్మసంబంధమైన ఆశీర్వాదములన్నిటిని క్రీస్తు శరీరములో ఉంచడానికి పరలోక మందున్న తండ్రి కోరుకున్నాడు. ఆ శరీరంలో ప్రవేశించి అందులో నిలిచియున్న వారికి మాత్రమే ఆ ఔదార్యముగల దానములు ప్రాప్తిస్తాయి.

ఈ పాత నిబంధన ఉదాహరణలను ఆలోచించు. ఇశ్రాయేలు ఐగుప్తును విడిచి వాగ్దాన దేశమైన కనాను దేశ ప్రయాణానికి సిద్ధపడుతోంది. తొలి పస్కా జరుగుతుంది. తాము నివసిస్తున్న యిండ్ల గడప కమ్ములకు ద్వార బంధాలకు సాయంకాలమున గొర్రెపిల్ల రక్తం పూసి, ఆ యిండ్లలోనే నిలిచియుండుడని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించాడు (నిర్గమ. 12:22). సంహారకునిచే దేవుడు ఆ యిండ్లను దాటి పోవునప్పుడు ఈ ఆజ్ఞకు

లోబడనివారి యింట జ్యేష్ఠకుమారుడు చనిపోతాడు. సమీపించుతున్న ఆ చారిత్రక సంఘటన ఎంత తీవ్రంగా ఉండియుంటుంది! ప్రతి ఇశ్రాయేలు కుటుంబము పవిత్రమైన భక్తిగల జాగ్రత్తలోనే నిలిచియుండి ఉంటారు. సాయంత్రపు వేళ సమీపించడానికి కొంచెం ముందుగానే, యింటనున్న జ్యేష్ఠకుమారుడు తన తండ్రితో, "నాయనా, గడప కమ్ముల మీదను, ద్వారబంధాల మీదను రక్తం పూయడం నిశ్చయమేనా?" అని అడిగితే, "అవును, నా కుమారుడా, ఆ పని నేనే స్వయంగా చేశానని" అతని తండ్రి బదులిచ్చినట్టు మనం ఊహించగలం. కొంచెం ఆగిన తరువాత, "నాయనా, నీవు సరిగా చేశావో లేదో నిశ్చయం చేసికొనడానికి మనం ఒక్కసారి చెక్ చేసికొనడం మంచిది కాదా? అని మరల కుమారుడు తన తండ్రిని అడిగాడట. సాయంత్రం కాబోతుంది, మనం మన యిండ్లలోనే నిలిచియుండాలి, మనం యిక చెక్ చేసికోలేం" "సరే, సమస్తము సరిగా జరిగినట్టు నిశ్చయం చేసికొనడానికి నేను మరల చెక్ చేస్తానులే" అని తండ్రి అన్నాడు. దేవుడు తమకు ఆజ్ఞాపించినట్టే వారి గడప కమ్ములు, ద్వారాబంధాలమీద రక్తం ప్రోక్షింపబడినట్టు అతని తండ్రి చెక్ చేశాడు. ఈ అభయములతో తండ్రి తన కుమారుని ఆదరిస్తున్నాడు: "నా కుమారుడా, సమస్తం కేవలం మంచిగా ఉంది. మనం దేవుని ఆజ్ఞలకు సంపూర్ణంగా లోబడ్డాం. దేవుని చిత్తాన్నిబట్టి నీవు క్షేమంగా ఉన్నావు."

వారు దేవుని ఆజ్ఞల పరిధిలో ఉన్నందున తండ్రి తన తనయునికి అభయమియ్య గలిగాడు. అదే విధంగా, "క్రీస్తునందు" దేవుని చిత్తంయొక్క పరిధిలో మనమున్నాం. తన కుమారునియందు మనం నమ్మకంగా నిలిచియున్నంతవరకు తండ్రి ఆత్మసంబంధమైన మన ప్రతి అవసరతను తీర్చుతాడు.

## వాగ్దానంతో కూడిన చోటు

మూడవది, భవిష్యత్తుకొరకైన మన నిరీక్షణ "క్రీస్తునందున్నది." ఈ జీవితానికి నిజమైన, దోష రహితమైన మార్గదర్శిగా మానవ జ్ఞానం ఉండ లోపిస్తుంది, కాని "బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందే గుప్తములైయున్నవి" (కొలస్సీ. 2:3). ఈ లోకము లయమై పోడానికే నియమించబడింది (2 పేతురు 3:10). లోకం కాలక్రమంలో నశించిపోతుంది గనుక, "క్రీస్తునందు" నిత్యమైన వాడబారని స్వాస్థ్యము మనకున్నది (ఎఫెసీ. 1:11).

క్రీస్తునందున్న మన నిరీక్షణను గూర్చి యోహాను యిలా వ్రాశాడు, "ఆ సాక్ష్యమే మనగా – దేవుడు మనకు నిత్య జీవమును దయచేసెను; ఈ జీవము ఆయన కుమారుని యందున్నది" (1 యోహాను 5:11). ఈ నిత్య జీవము మనకు రెండు విధాలుగా వస్తుంది: లోకములో సమృద్ధియైన జీవముగాను, రాబోవు లోకంలో నిత్యజీవముగాను వస్తుంది. క్రీస్తునందు ఈ జీవిత కాలంలో నిరీక్షణ ఉంది, రాబోవు జీవితానికి నిరీక్షణ ఉంది – ఇప్పుడు సమృద్ధియైన జీవము, పరలోకమందు నిత్యజీవము. "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని" ప్రభువైన యేసు తెలియజేశారు (యోహాను 10:10). మరియు యోహాను యింకను యిలా అన్నాడు,

"దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడు; దేవుని కుమారుని అంగీకరింపని వాడు జీవము లేనివాడే" (1 యోహాను 5:12). యోహాను యింకను యిలా వ్రాశాడు, "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" (1 యోహాను 5:13).

పాత నిబంధన చట్టము క్రింద, ఒకడు మరియొకని ఆకస్మికంగా చంపినట్లయితే, చనిపోయినవాని పట్ల పగతీర్చుకొనడానికి వెదకు అతని బంధువును తప్పించుకొనడానికి అతడు ఆశ్రయ పురానికి వెళ్లే ఏర్పాటుంది (యెహోషువా 20). ఆశ్రయ పురమందు అతడు నివసించునంతకాలం, అతడు కాపాడబడేవాడు. ఆ పట్టణంలో అతడు సహజమైన జీవితాన్ని సహజమైన భవిష్యత్తును కలిగియుండగలడు. అతడు ఆ పట్టణాన్ని విడిచిపెట్టి నట్టయితే, పగతీర్చుకొనేవాడు వానిని వెంటాడి, దాదాపు అతనిని చంపవచ్చు. అతనికి జీవితము, భవిష్యత్తు కేవలం ఆ ఆశ్రయ పురంలో మాత్రమే ఉంటుంది.

అలాగే, మన నిరీక్షణ "క్రీస్తునందు"న్నది. ఆయనకు వెలుపల మనకు అవసరమైన ఈ లోకమందు సమృద్ధియైన జీవముగాని, నిత్యత్వానికి భద్రమైన నిరీక్షణగాని లేదు. క్రీస్తునకు దూరస్థులైన అన్యజనులు ఈ లోకమందు నిరీక్షణ లేనివారని పౌలు తెలియ జేశాడు (ఎఫెసీ. 2:12). అలాగే, క్రీస్తునకు వెలుపలనున్న ఎవడైనను లోకమందు నిరీక్షణ లేనివాడైయుంటాడు.

## ముగింపు

"క్రీస్తునందు" అనే పద ప్రయోగం యొక్క వెలుగులో, "క్రీస్తులోనికి మనం వచ్చేది ఎలా?" అని అడుగకుంటే మనం అవివేకులమై యుంటాం. మన ప్రశ్నకు రెండు లేఖన భాగాలు జవాబిస్తాయి. మొదటిది, క్రొత్త నిబంధన బాప్తిస్మం ద్వారా మనం క్రీస్తులోనికి తేబడతామని రోమా 6:3లో పౌలు తెలిపాడు: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" రెండవది, అదే సత్యాన్ని పౌలు గలతీ. 3:27లో యిచ్చాడు: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు."

మనము క్రీస్తునందు విశ్వసించి, పాపజీవితం విషయమై మారుమనస్సుపొంది దేవుని వైపుకు తిరిగి, యేసే క్రీస్తని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందినప్పుడు దేవుని కృపా కార్యాన్నిబట్టి, మనం క్రీస్తులోనికి ప్రవేశిస్తాం. మన స్థితి వెంటనే మారిపోతుంది, ఎలాగంటే మనం ధన్యకరమైన, ఏర్పాట్లతో కూడిన, వాగ్దానము గల చోటికి వచ్చాం. దేవుని వాక్యపు పోషణలో మనం అనుదినం ఎదుగుతూ ఉంటే మన స్థితి, క్రీస్తుతోను, దేవుని కుటుంబంతోను, వెలుగులో మన నడక మారుతూ ఉంటుంది.

తనకు చెందిన భూ భాగంలో నూనె ఉన్నట్టు కనుగొనబడిన యొక మత శాఖను గూర్చి నేను చదివాను. అది నూనె బుగ్గ, ఆ సంఘం త్వరలో ధనవంతమైయిందిగా మారిపోయింది. వెంటనే వారి సభ్యత్వాన్ని యితరులకు యివ్వకుండ మూసివేసి, వారి

నెలసరి లాభాలను సభ్యులు సమానంగా పంచుకోనారంభించారు. ఈ సంఘం తక్షణమే వ్యాపారమయ్యి, అందులో ఉన్నవారికి గొప్ప భౌతిక సౌభాగ్యాన్ని తెచ్చిపెట్టింది.

క్రొత్త నిబంధన సంఘము ఈ మత శాఖకును మిగిలిన మత శాఖలన్నిటికిని భిన్నమైనది! ఇది పరలోకపు దీవెనలతో నింపబడిన క్రీస్తుయొక్క ఆత్మసంబంధమైన శరీరమైయుంది. దీని సభ్యత్వం ఎన్నడు మూయబడదు. సువార్తకు లోబడిన ఎవడైనను అందులో ప్రవేశించి దేవుని ఔదార్య భాగ్యాలను అందుకోవచ్చు. ఆత్మసంబంధమైన ఆశీర్వాదములన్నిటికి, అన్ని వేళల ఆత్మయందు క్రీస్తుద్వారా ప్రతి ఒక్క సభ్యుడును అందుకోవచ్చు. పరలోకపు బ్యాంక్ మూయబడినట్టు లేక ఆత్మసంబంధమైన నిధులను సరఫరా చేయలేని పరిస్థితితో ఎవడును ఎన్నడు కనుగొనలేడు.

క్రీస్తునందున్న వ్యక్తి దేవుని కుమారుడయ్యే ఆధిక్యత కలిగియుండి, ఆత్మసంబంధమైన ఆశీర్వాదములన్నిటికిని, నిత్యజీవమును గూర్చిన నిరీక్షణకును హక్కు కలిగియున్నందున, "నీవు క్రీస్తునందున్నావా?" అనే దానికంటే అడుగగల గొప్ప ప్రశ్న ఏదీ ఉండదు.

## స్టడీ మరియు చర్చకొరకు ప్రశ్నలు

1. క్రొత్త నిబంధనలో "క్రీస్తునందు" అనే ప్రయోగం ఎన్ని రూపాలుగా కన్పిస్తుందో తెలుపుము.
2. "క్రీస్తునందు," "సంఘమునందు" అనే ప్రయోగాలను పోల్చి చూడు.
3. ఎఫెసీ. 1:4-6లో పౌలు వర్ణించిన భవిష్యత్ నిర్ణయాన్ని వర్ణించు.
4. భవిష్యత్ నిర్ణయం అనే భావనను నోవహుకును అతని కుటుంబానికిని జలప్రళయానికిని గల సంబంధాన్ని చూపించు.
5. "సమృద్ధియైన జీవానికి," నిత్యజీవంతో సంబంధం తెలుపు.
6. "క్రీస్తునందు" మనకున్న కొన్ని ముఖ్యమైన ఆశీర్వాదములను పేర్కొని వాటిలో ఒక్కొక్క దాన్ని క్లుప్తంగా వర్ణించు.
7. పాత నిబంధన కాలంలో ఆశ్రయపురాలను వాటి పనిని వర్ణించు.
8. ఎఫెసీ. 2:12ని "క్రీస్తునందు" అనే సంబంధంగా వర్ణించు.
9. క్రీస్తులోనికి ప్రవేశించడాన్ని గూర్చి రోమా 6:3 ఏమంటుంది?
10. క్రీస్తులోనికి ప్రవేశించడాన్ని గూర్చి గలతీ. 3:27 ఏమంటుంది?
11. క్రీస్తులో మన స్థానంతో మన స్థితిని పోల్చు.
12. మనం "క్రీస్తులో" ఉన్నట్టు ఎలా నిశ్చయం కలిగియుండగలం?